క్లుప్తంగా

కొబ్బరికాయల అమ్మకానికి వేలం

నేరేడుచర్ల : శివరాత్రి పర్వదినం సందర్భంగా నేరేడుచర్ల మండలంలోని సోమారం గ్రామంలోని సోమప్ప దేవాలయంలో కొబ్బరికాయల అమ్మకానికి శుక్రవారం ఆలయ పర్యవేక్షణ అధికారి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. పల్లా నాగేశ్వర్‌రావు రూ.98 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కొంకపాక మృత్యుంజయ శాస్త్రి, ఆలయ పూజారి శ్రీనివాసశర్మ, కమిటీ సభ్యులు లక్ష్మయ్య, సైదులు, సోములు, వెంకట్రావ్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలు నింపాలని వినతి

మునగాల : యాసంగి సీజన్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా సాగర్ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. ఈమేరకు శుక్రవారం మునగాల తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు కూడా రాకపోవడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



స్విచ్ ఆన్ చేసి మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీ

హుజూర్‌నగర్‌రూరల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ తెలిపారు. హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో ఇటీవల వేసిన తాగునీటి బోరును ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రెక్కల ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయరాజు, చిన్నప్ప, కార్యదర్శి గిరిజాకుమారి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి పల్స్ పోలియో

హుజూర్‌నగర్ : ఐదేళ్లలోపు పిల్లలకు మార్చి 3 నుంచి మూడు రోజుల పాటు పోలియో చుక్కలు వేయనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో పల్స్ పోలియోపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలియో కేంద్రాలతో పాటు బస్టాండ్లు, అపార్ట్‌మెంట్ నిర్మాణాలు జరిగే చోట, సంచార జాతుల నివాస స్థలాల్లో, ఇటుక బట్టీల వద్ద పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో సీహెచ్‌ఓ పద్మ, రూట్ సూపర్‌వైజర్లు నూర్జహాన్ బేగం, సీహెచ్.పద్మ, గజగంటి ప్రభాకర్, ఇందిరాల రామకృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దు



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, దాతలు

గరిడేపల్లి : విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందొద్దని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, రీజియన్ మాజీ చైర్మన్ సుందరి నాగయ్య అన్నారు. గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ సమయంలో శుక్రవారం దాతల సహకారంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. కాగా, బయోసైన్స్ ఉపాధ్యాయురాలు పవిత్రమన్మథరెడ్డి దంపతులు అల్పాహారం కు రూ. 3వేలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు చిత్రం విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యను పట్టించుకోని ప్రత్యేక అధికారి'

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎన్‌ఎస్పీ ఏఈ నరసింహమూర్తి గ్రామ సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాడని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎల్లావుల సైదులు ఆరోపించారు. శుక్రవారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యదర్శి, ప్రత్యేక అధికారి ఒకరి మీద ఒకరు నాది బాధ్యత కాదంటే నాది కాదని అని తప్పించుకుంటున్నారని ఆరోపించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శుక్రవారం కృష్ణానగర్ గ్రామానికి చెందిన వీరంశెట్టి సైదులు కుమారుడు వరుణ్ జన్మదినం సందర్భంగా అనాథ వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా ఏఎస్‌ఆర్ వృక్షం ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ ఆవుల సైదేశ్వరరావు హాజరై మాట్లాడారు. సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, జ్యోతి, రామయ్య పాల్గొన్నారు.

ఎండిపోయిన పాలేరు వాగు

- పొలాలకు నీరందక అరిగోస పడుతున్న రైతన్నలు
- పొట్టదశలో ఉన్న వరి
- సాగర్ నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని వేడుకోలు



నల్లబండగూడెం శివారులో ఎండిపోయిన పాలేరు వాగు

కోదాడరూరల్ : యాసంగి సీజన్‌లో వరి సాగు చేసిన అన్నదాతలు పంటకు నీరందక అరిగోసలు పడుతున్నారు. సాగర్ ఆయకట్టులో అధికారులు క్రాఫ్ హాలిడే ప్రకటించినప్పటికీ పాలేరు వాగు కింద మోటార్ల సహాయంతో వ్యవసాయం చేసే రైతులు తమకున్న భూములను బీడులుగా ఉంచుకోలేక రెండు నెలల కిందట వాగులో నీరు ఉండటంతో వ రిసాగు చేపట్టారు. మరికొంత మంది రైతులు బోర్ల ఆధారంగా, తమ వ్యవసాయ భూముల్లో బావులు తీసుకుని వరిసాగు చేశారు. కానీ ప్రస్తుతం వాగులో నీరు పూర్తిగా ఎండిపోవడంతో మోటార్లకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఏదోవిధంగా వరుసగా తడులిస్తూ పంటను కాపాడుకుంటూ వచ్చామని వాగు పూర్తిగా ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని అంటున్నారు.

20 వేల ఎకరాల్లో సాగు

పాలేరు వాగు పరివాహక ప్రాంతంలో వాగు నీటిని నమ్ముకుని అనంతగిరి, కోదాడ మండలాల్లోని పాలారం, చనుపల్లి, కిష్టాపురం, మొగలాయికోట, శాంతినగర్, గోండ్రియాల, చిమిర్యాల, మంగళితండా, కొత్తగూడెం, రెడ్లకుంటతో పాటు ఖమ్మం జిల్లాలోని ఈశ్వరమాధారం, రాజుపేట, జక్కేపల్లితో పాటు నేల కొండపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు దాదాపుగా 20 వేల ఎకరాల వరి సాగు చేపట్టారు. వారు ఎప్పటిలాగే వాగులో మోటార్ల సహాయంతో సాగు చేసుకుంటూ వస్తున్నారు. తాగునీటి కోసం సాగర్ నీటిని విడుదల చేస్తే వాగు ప్రవహిస్తుంది. దీంతో తమ పంటపొలాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఆశతో ఉన్నారు. అయితే తాగు నీటికోసం గత నెల 31 నుంచి ఈ నెల 9 వరకు విడుదల చేసిన నీటిని తూములకు విడుదల చేయకపోవడం, పాలేరు రిజర్వాయర్ కూడా పూర్తి స్థాయిలో నిండకపోవడంతో వాగులోకి నీరు రాకుండా పోయింది. దీంతో వేల రూపాయల పెట్టుబడులు పెట్టి వరి సాగు చేసుకుంటే పాలేరు వాగులో నీరు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలతో..

ప్రస్తుతం పంట నిండు పొట్ట దశలో ఉందని లక్షలు పెట్టుబడి పెట్టి పొలాన్ని వదిలేయాలంటే బాధ కలుగుతుందని రైతన్నలు దీనంగా చెప్తున్నారు. పంటను వదలుకోలేక ఇప్పటికే వాగు సమీపాల్లో మోటార్లకు నీరందేవిధంగా జేసీబీలతో గుంతలు తీయించిన ఫలితం లేదని రైతులు అంటున్నారు.

వాగును నమ్ముకుని సాగు చేశా



పాలేరు వాగు నీటిని నమ్ముకుని ఎప్పటిలాగే 10 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇరవై రోజుల వరకు వాగులో నీరు ఉండటంతో పొలం పారింది. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. నీరు లేకపోవడంతో ఎండిపోయేలా ఉంది. తడులు ఇస్తూ విడతల వారీగా పంటను కాపాడుకుంటూ వస్తున్నాం. పరిస్థితి ఇలాగే ఉంటే సగం పంట ఎండిపోయే ప్రమాదం ఉంది.

– మల్లెల నిరంజన్, రైతు, రెడ్లకుంట గ్రామం

దీనికి తోడు పాలేరు వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కువకావడం జేసీబీల సహాయంతో వాగులో నుంచి ఇసుకను తవ్వుతుండటంతో వాగు ఎండిపోవడానికి కారణమైందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సాగర్ నీటిని విడుదల చేసి తమ పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

కోలాటం పోటీలు ప్రారంభం



బరాఖత్‌గూడెంలో కోలాటం పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో గల స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు రాష్ట్రాల కోలాట పోటీలను శుక్రవారం మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. కోలాటం పోటీల విజేతలకు ప్రథమ బహుమతి రూ.25వేల నగదు, ద్వితీయ రూ.20 వేలు, తృతీయ, చతుర్థ, పంచమ, ఆరవ, ఏడవ, ఎనిమిదవ బహుమతులు వరుసగా రూ.18వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.పదివేలు, రూ.8వేలు, రూ.ఆరువేలు నగదు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో పాల్గొనదలిచే కళాకారులు 9010767415, 97004 26132 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కోలాట కళాకారులు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు.

చైర్మన్, వైస్‌చైర్మన్ ఆధ్వర్యంలో ఆలయ బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్, వైస్ చైర్మన్లు కర్నె ఓబుల్‌రెడ్డి, సాముల బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలోనే ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మకర్తలు రెక్కల శంభిరెడ్డి, పల్లె నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు గ్రామంలో చందాల రూపంలో వచ్చిన ఆలయ నిధులను దుర్వినియోగానికి పాల్పడటంతో ఇటీవల హైకోర్టును ఆశ్రయించినట్లు వారు తెలిపారు. తమ ప్రమేయం లేకుండా ఎవరైనా చందాలు వసూలు చేస్తే ఆలయ కమిటీకి సంబంధం లేదని చైర్మన్, వైస్‌చైర్మన్ తెలిపారు. అనంతరం హైకోర్టు ఉత్తర్వులను గ్రామ పెద్దలకు అందించారు. ధర్మకర్తలు సారెడ్డి అంజిరెడ్డి, కుందూరు కోటిరెడ్డి, కర్నె రాంమోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు భాస్కర్‌రెడ్డి, సైదిరెడ్డి, జోజిరెడ్డి, వెంకటరెడ్డి, భోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సహస్రనామ కుంకుమార్చన



గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహవేణుగోపాలస్వామి దేవాలయంలో సహస్రనామ కుంకుమార్చనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, మంగళాశాసనం, గోమాతకు పూజలను వైభవంగా నిర్వహించారు. శ్రీగోదావేణు గోపాల భజన బృందంచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి



ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, రైతులు

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం సాగు నీరు ఇచ్చి కాపాడాలని జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగర్, మిర్యాలగూడెం, హుజూర్‌నగర్, కోదాడ పరిధిలో రైతులు సాగుచేసిన వరిపొలాలు పొట్ట దశలో ఉన్నాయని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లు నీరు అందించక పొలాలు ఎండిపోతున్నాయన్నారు. కనీసం పది రోజులైనా నీళ్లు ఇవ్వకపోతే పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి సాగర్ నీటితో చెరువులు నింపాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్ నబి, గుజ్జుల అంజిరెడ్డి, అలీ, ఉస్తెల లింగారెడ్డి, దనమూర్తి, అంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మట్టారెడ్డి, సైదులు, ముజీబ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పొలాల పరిశీలన

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెం, వెంకట్రాంపురం, గారకుంట తండా, గానుగబండ పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించాలని, కనీసం ఒక తడి అయినా నీరు వదిలి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్‌లు కోరారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో సాగర్‌లో డెడ్ స్టోరేజీ వాటర్ ఉన్నా పంట పొలాలకు నీరిచ్చినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుత్తికొండ వెంకటరమణారెడ్డి, శౌరెడ్డి, చలమారెడ్డి, అంబటి సైదమ్మ, నాగమణి, వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.మహేందర్‌కుమారు సూచించారు. శుక్రవారం ఆయన దేవాలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉత్సవ కమిటీని ఆదేశించారు. ఆయన వెంట ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాలిశెట్టి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు కందాల శ్రీనివాసాచార్యులు, అర్చకులు ప్రశాంత్ చార్యులు, సముద్రాల నరసింహాచార్యులు, ఈఓ చలపతి, గ్రామస్తులు ఓరుగంటి రవి, కాలె సామేలు, బోనాల శ్రీధర్, గడ్డం చంద్రారెడ్డి, రణబోతు వీరారెడ్డి, రంగారెడ్డి, శ్రీను ఉన్నారు.

ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం శ్రీస్వామిఅమ్మవార్లను నూతన వధూవరులుగా అందంగా అలంకరించారు. ఆలయంలో సుప్రభాతసేవ, మూలమంత్రహోమం, బలిహరణ, వాస్తుహోమం, నిత్యహోమం, నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం సాయంత్రం ఎదుర్కోళ్ల మహోత్సవంతో శ్రీస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరగిరినాథుని రామక్రిష్ణమాచార్యులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : చౌటపల్లిలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

వేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సీతారామచంద్రస్వామిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ప్రాత కాలార్చన తిరుప్పావై సేవాకాలం తదుపరి భజయతిరాజమ్ స్తోత్రాన్ని రుత్వికులు పారాయణం చేశారు. పల్లకీ సేవ అనంతరం స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. తదనంతరం కల్యాణోత్సవానికి తలంబ్రాలు మహిళలు సామూహికంగా తయారు చేశారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గోదాదేవిని వివిధ వాహనాలపై ఊరేగింపుగా స్వామిని గట్టుపైకి చేర్చి అక్కడ ధ్వజారోహణం నిర్వహించారు. గరుడ ప్రసాదాన్ని సంతానం లేని వారికి అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, స్థానాచార్యులు, అధ్యాపకులు, అర్చకులు, యాగ్నికులు, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కోదాడ పట్టణాభివృద్ధికి తొలి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడ : కొమరబండ వై జంక్షన్ స్వాగత ద్వారానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

కోదాడ : నియోజకవర్గ కేంద్రమైన కోదాడ పట్టణాభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ వై జంక్షన్, దుర్గాపురం వై జంక్షన్‌ల వద్ద కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించతలపెట్టిన స్వాగత ద్వారాలకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు జంక్షన్ అభివృద్ధికి రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అదేవిధంగా శ్రీరంగాపురం, బాలాజీనగర్‌లలో ఒక్కొక్కటి కోటి 43 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌లకు ఆమె శంకుస్థాపన చేశారు.

రూ.8 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్

కోదాడ పెద్దచెరువు కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.8 కోట్లతో చేపట్టిన పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అమృత్ పథకం ద్వారా కోదాడ పట్టణంలో 6 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి రూ. 25.80 కోట్లు మంజూరు కాగా, ఉత్తమ్ పద్మావతినగర్ పార్క్‌లో నిర్మించ తలపెట్టిన ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ఏర్నేని బాబు, పారా సీతయ్య, బుర్రా పుల్లారెడ్డి, కర్రి శివ, పెండెం వెంకటేశ్వర్లు, గంధం యాదగిరి, షాబుద్దీన్, తిపిరిశెట్టి సుశీల, కొల్లా కోటిరెడ్డి, సామినేని రమేష్, ముస్తాఫా, కర్రి సుబ్బారావు, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

కోదాడ అర్బన్ : ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో గల అభయాంజనేయస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి శాంతికల్యాణాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా జరిపారు. ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపలి చందర్‌రావు, ప్రముఖులు శాంతి కల్యాణంలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వనపర్తి రామయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలరమేష్, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, రామారావు, కర్రి శివ, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు 2008 డీఎస్సీ అభ్యర్థుల వినతి

కోదాడఅర్బన్ : 2008 డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డికి శుక్రవారం కోదాడకు చెందిన 2008 డీఎస్సీ అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఉద్యోగం ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని, గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు తమ సమస్యలను మొరపెట్టుకున్న పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎల్వీఆర్, పల్లా వెంకన్న, వెంకట్, నాగరాజు, రాజశేఖర్, వరలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన శంకుస్థాపనకు ఆహ్వానం

కోదాడరూరల్ : కోదాడ కోర్టు నూతన భవనంతో పాటు నూతనంగా మంజూరైన సబ్‌కోర్టు పనులను శనివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, మరో నలుగురు జడ్జిలు ప్రారంభించనున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరుతూ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డికి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసునాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. న్యాయవాదులు రామిశెట్టి రామకృష్ణ, సంపెట సుధాకర్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మునగాల : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు శుక్రవారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తహసీల్దార్ వి.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాసరావు, సారెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగూడెం : మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ హేమామాలిని శుక్రవారం తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న తహసీల్దార్

చిలుకూరు : చిలుకూరులో శ్రీగోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రథమ బహుమతి అమరోజు స్వాతి, ద్వితీయ బహుమతి కైలాసపు శ్రీవిద్య, తృతీయ బహుమతి భద్రంరాజు నాగశ్రీ, నాల్గొవ బహుమతి గంగిరెడ్డి పావని, ఐదవ బహుమతి కాటూరి దీక్షిత సాధించారు. విజేతలకు తహసీల్దార్ ధృవకుమార్, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ శైలజ, ఆర్ఐ మంజుల, పశువైద్యాధికారి వీరారెడ్డితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. శనివారం కోలాట, భజన కార్యక్రమం, అమ్మవారి ఊరేగింపు, ఆదివారం బోనాలు మహోత్సవం ఉన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మంత్రి ఉత్తమ్ సహకారంతో గ్రామాలు అభివృద్ధి



మఠంపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాలకవీడు : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. శుక్రవారం పాలకవీడు మండలంలోని యల్లాపురం, సజ్జాపురం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 15 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా శూన్యపహాడ్‌లో రూ.7 లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఎంపీటీసీ కవిత సీమానాయక్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాళోతు మోతీలాల్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మఠంపల్లి : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచి హోసన్నా మందిరం, వీవీహైస్కూల్ వరకు రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామపెద్దలు ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషోర్‌రెడ్డి, కర్నె వెంకటేశ్వర్లు, లూర్దుమారెడ్డి, రాంచంద్రారెడ్డి, దైదా రాయలు, ఏసుమల్ల రాములు, జానిపాషా, వీరబాబు, ఆంథోనిరెడ్డి, లక్ష్మీనారాయణ, మధు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాటిస్తే తప్పని నాయకుడు మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : మాటిస్తే తప్పని నాయకుడు మంత్రి ఉత్తమ్ అని యునైటెడ్ క్రిస్టియన్ మైనార్టీ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కొనియాడారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని మంత్రి ఉత్తమ్ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో క్రైస్తవుల శ్మశాన వాటిక అభివృద్ధికి మాట ఇచ్చిన 60 రోజుల్లోనే రూ.50 లక్షలు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు జి.డేవిడ్ రాజు, టి.సుధాకర్, గుండు సామ్యూల్, ప్రసాద్, జాన్‌పాల్, అదాము, అభిషేక్, జాన్‌వెస్లి, ఇస్సాకు, సామేలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధుల మంజూరుపై హర్షం

హుజూర్‌నగర్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని క్రైస్తవుల శ్మశానవాటిక అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నను శుక్రవారం హుజూర్‌నగర్‌లో సన్మానించి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ నాయకులు కేజే ఉదయ్‌బాబు, ఎం.బెంజిమెన్, సతీష్, కపాదానం, ఇమ్మానుయేల్, మత్తయి, సత్యానందం, జీవన్ ఐజక్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులపై ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మోతె : అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ బి.శిరీష హెచ్చరించారు. మోతె మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం 10 గంటల 20 నిమిషాలకు ఆమె కార్యాలయానికి వెళ్లగా ఆ సమయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అటెండర్‌తో అధికారులు, సిబ్బందికి ఫోన్ చేయించి పిలిపించారు. దీంతో ఒక్కొక్కరు కార్యాలయానికి చేరుకోగా, సమయపాలన పాటించకపోవడంపై వారిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్ ఏఈ మూడు రోజులుగా హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయకపోవడంపై ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ అర్ధగంట ఆలస్యంగా రావడంతో అతనికి రిజిస్టర్‌లో ఆబ్సెంట్ వేశారు. ఎంపీడీఓ గురువారం రిజిస్టర్‌లో చేయకపోవడంతో కార్యాలయానికి వచ్చిన వెంటనే సంతకం చేయడం తెలియదా అని మందలించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ రిజిస్టర్‌లో సంతకం పెట్టి, క్షేత్రస్థాయి డ్యూటీకి వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో తప్పక రాయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహించాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చూడాలని చెప్పారు. ఆమె వెంట కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటాచారి, ఏపీఓ నగేష్, ఈసీ శ్రీహరి, టీఏలు సురేష్, రామయ్య, సీఓలు శ్రీనివాస్, మల్సూర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కోదాడఅర్బన్ : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు



నేరేడుచర్ల : నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కోదాడఅర్బన్ : రైతుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని పంజాబ్, హరియాణా బోర్డర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతాంగ ఉద్యమకారులపై కేంద్ర బలగాలు కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ శుక్రవారం కోదాడలో రైతు సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన రైతు శుభకరణ్‌సింగ్ మృతి చెందడం బాధాకరమన్నారు. గత ఉద్యమ సమయంలో రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ఎన్‌డీ డివిజన్ నాయకులు ఉదయగిరి, సీపీఎం రైతు సంఘం జిల్లా నాయకులు వీరాంజనేయులు, సీపీఐ జిల్లా నాయకుడు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి లతీఫ్, ఏఐకెఎంఎస్ నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, సైదులు, వెంకన్న, జానీ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు జరపడం అన్యాయం

నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నేరేడుచర్లలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వాస పల్లయ్య మాట్లాడుతూ రైతులపై హరియాణా ప్రభుత్వం కాల్పులు జరపడం అన్యాయమన్నారు. నాయకులు సత్తెమ్మ, సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, శ్రీను, సత్యం, రంగయ్య, లక్ష్మయ్య, మౌలాంబి, పావని, లక్ష్మి, దేవయ్య, దుర్గమ్మ తదితరులు ఉన్నారు.